క్లుప్తంగా

లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో ముడుపుల పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: స్థానిక లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో గురువారం భక్తులు ముడుపుల పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు ఆలయ అర్చకుడు పీసపాటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో లక్ష్మీనృసింహ స్వామివారికి ఉదయం 6 గంటలనుంచే భక్తిశ్రద్ధలతో ముడుపుల పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకుడు శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ ప్రతి గురువారం ముడుపులు పూజలను ప్రారంభించిన వారు 9 వారాలు కొన సాగిస్తారని, కట్టిన ముడుపులను సింహాచలం వరాహ నరసింహ స్వామి ఆలయంలో చెల్లించుకుంటారని చెప్పారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులు వేసిన చిత్రాలను ఆవిష్కరిస్తున్న అధికారులు, ప్రిన్సిపాల్

పార్వతీపురంటౌన్: విద్యార్థులతో పాటు అన్ని వర్గాల వారు మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల వాడకానికి దూరంగా ఉండాలని ఎస్ఈబీ ఎస్సై పద్మావతి హితవు పలికారు. ఈ మేరకు మాదక ద్రవ్యాల నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డ్రగ్స్ వినియోగం వల్ల ఏర్పడే అనర్థాలు, ఆరోగ్య సమస్యలు, చట్టపరమైన కేసులు, అనుభవించాల్సిన శిక్షలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చలపతిరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

50మంది నిరుపేదలకు వస్త్రాల పంపిణీ



వస్త్రాలు పంపిణీ చేస్తున్న దాత గౌరీశంకరరావు

బలిజిపేట: మండలంలోని పెదపెంకి గ్రామానికి చెందిన గౌరీశంకరరావు తన భార్య జ్ఞాపకార్థం 50మంది నిరుపేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. అనంతరం నిరుపేదలకు అన్నదానం నిర్వహించారు. నిరుపేదలకు ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆయనను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో ఈర్ల సంజీవనాయుడు, గౌరీశంకరరావు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

జక్కువలో చోరీ

మెంటాడ: మండల కేంద్రానికి చెందిన మతల శ్రీరామ్ ఉదయాన్నే భార్యతో కలిసి వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లి మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. దీంతో లోపలికి వెళ్లి చూడగా బీరువా తాళం బద్దలు కొట్టి తెరిచి ఉంది. బీరువాలో ఉంచిన మూడు తులాల బంగారు నగలు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై దేవితో పాటు సిబ్బంది, క్లూస్ టీమ్ చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.

సారా, మద్యం బాటిల్స్ ధ్వంసం

సాలూరు: మక్కువ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుకున్న సారా, మద్యం బాటిల్స్‌ను ఏఎస్పీ సునీల్‌సరోన్ పర్యవేక్షణలో, ఎస్సై నరసింహమూర్తి, సిబ్బంది గురువారం ధ్వంసం చేశారు. పలు కేసుల్లో పట్టుకున్న 647 లీటర్ల సారా, 155 లీటర్ల మద్యం పారబోశారు.

పచ్చబిళ్ల వేసుకున్న ప్రధానోపాధ్యాయుడు?

- సభ్యుల ఆరోపణ
- పాఠశాల సమయం దాటిన తరువాత ఎంపిక
- పూర్తిగా నిబంధనలకు విరుద్ధం



ప్రధానోపాధ్యాయుడి తీరుపై ఆరోపణలు చేస్తున్న సభ్యులు



ఎస్ఎంసీ ఎంపిక సమయంలో మాట్లాడుతున్న ఎంఈఓ-1సామల

బలిజిపేట: మండలంలోని పెదపెంకి-1వ నంబర్ పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ ఎంపికలో ప్రధానోపాధ్యాయుడు పచ్చబిళ్ల వేసుకున్నాడని ఎంపికైన కొందరు సభ్యులు ఆరోపించారు. పాఠశాల చైర్మన్ ఎంపిక నిబంధనలకు విరుద్ధంగా కోరం ఉన్నప్పుడు మానివేసి వేరే గ్రూప్‌వారు వచ్చేటప్పుడు, పాఠశాల సమయం దాటిన తరువాత నిర్వహించి దారుణంగా వ్యవహరించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పాఠశాలలో 5తరగతులకు 44మంది విద్యార్థులు ఉన్నారు. ముందుగా తరగతుల వారీగా సభ్యుల ఎంపిక ఉదయం 11గంటలకు పూర్తయింది. మధ్యాహ్నం 2గంటలకు మెంబర్లు రావాలని చెప్పి పంపించివేశారు. 9మంది సభ్యులం 2గంటలకుముందే పాఠశాల వద్దకు వచ్చి చైర్మన్ ఎన్నిక చేయాలని ప్రధానోపాధ్యాయుడిని అడగ్గా 15మంది సభ్యులు ఉంటేనే ఎంపిక నిర్వహిస్తామని, లేకపోతే వాయిదా వేస్తామన్నారు. ఆ తరువాత మళ్లీ అడగగా ఇంకా ఎవరూ రాలేదని చెప్పడంతో వెళ్లిపోయాం. మధ్యాహ్నం 3గంటల సమయంలో రమ్మని సమాచారం ఇవ్వడంతో మాకు సంబంధించిన వారంతా వెళ్లి ఇదేమిటని ప్రశ్నించారు. నిబంధనల ప్రకారం మధ్యాహ్నం 1గంటకు ఎంపిక జరగాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా ఎలా నిర్వహిస్తారని, ఇందుకు ఎవరు ప్రోత్సహిస్తున్నారని ప్రశ్నించాం. ఇంతలో పాఠశాల సమయం పూర్తయి విద్యార్థులు వెళ్లిపోయారు. పాఠశాల సమయం పూర్తయిన తరువాత ఎంపిక ఏ విధంగా చేస్తారని, మరో రోజు ఎంపిక నిర్వహించాలని కోరినప్పటికీ హెచ్ఎం ఇష్టానుసారం నిర్వహించి చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపికను పూర్తిచేశారని ఆరోపించారు. ప్రధానోపాధ్యాయుడు పాఠశాలను, విద్యార్థులను బాగుచేయడానికి వచ్చారా? రాజకీయాలు చేయడానికి వచ్చారా అన్నది ప్రశ్నార్థకంగా ఉందని దీనిపై అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు.

7ఎస్ఎంసీల ఎంపిక వాయిదా

మండలంలోని 56పాఠశాలలకు ఎస్ఎంసీ ఎన్నికలు జరగాల్సి ఉండగా 49పాఠశాలలకు ఎన్నికలు జరిగి 7పాఠశాలలకు ఎంపిక వాయిదా పడిందని ఎంఈఓ-1సామల సింహాచలం తెలిపారు. ఎంపికైన వారితో ప్రమాణస్వీకారం చేయించామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న పాఠశాలలకు ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు ఎంపిక నిర్వహిస్తామన్నారు. అందులో భాగంగా బలిజిపేట ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ ఎన్నిక ప్రక్రియను ఆయన గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతం

- 3 పాఠశాలలకు నిలిపివేత



సీతానగరం: ఉన్నత పాఠశాలలో జరిగిన ఎన్నికల్లో పాల్గొన్న ఎంఈఓ సూరిదేముడు

సీతానగరం: మండల విద్యాశాఖ పర్యవేక్షణలో గురువారం నిర్వహించిన ఎస్ఎంసీ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఎంఈఓ జి.సూరిదేముడు అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 62 పాఠశాలలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలని మార్గదర్శకాలు రావడంతో 59 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. మిగతా అంటిపేట, కొత్తవలస ప్రాథమిక పాఠశాలలు, నిడగల్లు ఉన్నత పాఠశాలలో కోరం లేక ఎన్నికలు వాయిదా పడినట్లు తెలియజేశారు. ఎన్నికల్లో సహకరించిన పిల్లల తల్లిదండ్రులకు, ఎన్నికైన సభ్యులకు అభినందనలు తెలియజేశారు. ఎస్ఎంసీ కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్,పాలకవర్గాల పదవీకాలం రెండు సంవత్సరాల్లో పాఠశాలలు అభివృద్ధి చేయడం, విద్యార్థుల సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు.

ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు



మాతుమూరు పాఠశాలకు సంబంధించి గెలుపొందిన అభ్యర్థులను అభినందిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



పురోహితుని వలస మోడల్ స్కూల్ కమిటీ చైర్మన్‌గా బంకు శ్రీను ఎన్నికైనట్లు ప్రకటిస్తున్న ప్రిన్సిపాల్

సాలూరు రూరల్: మండలంలోని 150 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. పాఠశాలల హెచ్ఎంల ఆధ్వర్యంలో అత్యధికంగా ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. కొన్ని చోట్ల పోటీ పడ్డారు. పురోహితుని వలస మోడల్ స్కూల్ చైర్మన్‌గా బంకురు శ్రీను ఎన్నికయ్యారు. కూర్మరాజుపేట ఎంపీయూపీ పాఠశాలలో గుమ్మడి వెంకట రమణ, మామిడిపల్లి జిల్లా పరిషత్ పాఠశాల చైర్మన్‌గా కనకల రమణమ్మ, తోణాం ఆశ్రమ పాఠశాలలో బసవ రజని, సారిక ఎంపీపీ స్కూల్ చైర్మన్‌గా గుంట ప్రమీల ఎన్నికయ్యారు. అన్ని పాఠశాలల్లోను ఎన్నికలు పూర్తి చేసినట్లు ఎంఈఓ రాజ్‌కుమార్ తెలిపారు.

సాలూరులో....

సాలూరు: నియోజకవర్గంలో సాలూరు పట్టణం, మండలం, పాచిపెంట, మక్కువ, మెంటాడ మండలాల్లో ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. నియోజకవర్గంలో 343 పాఠశాలలకు గాను 342 పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి.మెంటాడ మండలం మేడపల్లి మోడల్ స్కూల్‌లో కోరం లేక ఎన్నిక వాయిదా పడింది. సాలూరు మండలం పురోహితునివలస మోడల్ స్కూల్ కమిటీ చైర్మన్‌గా బంకురు శ్రీనివాసరావు గెలుపొందారు.

పాచిపెంటలో ప్రశాంతం



కేసలి పాఠశాలకు నూతనంగా ఎన్నికైన చైర్మన్, కమిటీ సభ్యులతో వైఎస్సార్‌సీపీ నేతలు

పాచిపెంట: మండలంలోని 121 పాఠశాలల్లో గురువారం నిర్వహించిన ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎంఈఓలు పల్లి జోగారావు, సతీష్‌లు తెలిపారు.పలు ప్రాంతాల్లో కూటమి నేతలు అధికార పార్టీ నాయకులమంటూ ఈ ఎన్నికలకు రాజకీయ రంగు పులిమి అత్యుత్సాహం చూపించారు.ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రంగంలోకి దిగి మండలంలో సుమారు 60 శాతం వైఎస్సార్‌సీపీ మద్దతుదారులను గెలిపించుకున్నారు.

పార్వతీపురంలో..

పార్వతీపురం టౌన్: మండలంలోని 115 పాఠశాలల్లో గురువారం నిర్వహించిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచే పాఠశాలల వద్ద ఎన్నికల కోలాహలం ప్రారంభమయ్యింది. విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నికల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎన్నికల్లో ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా స్థానిక పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణారావు పర్యవేక్షణలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు. మండలంలోని 90 ప్రాథమిక, 7ప్రాథమికోన్నత, 18 జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు జరిగాయి. ఎంఈఓ ఎస్.సింహాచలం పర్యవేక్షణలో నిర్వహించిన ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించి ఘర్షణలను నిలువరించారు.

ఆదివాసీ దినోత్సవమంటే పండుగ కాదు

- ఏపీ రైతు కూలీసంఘం



సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న రైతు కూలీసంఘం నాయకులు

పార్వతీపురంటౌన్: ఆదివాసీ దినోత్సవం అంటే పండగ కాదని ఆదివాసీ సమస్యల పోరాట దినమని ఏపీ రైతు కూలీసంఘం జిల్లా అధ్యక్షుడు ఊయక ముత్యాలు అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని గిరిజన భవనం వద్ద సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గిరిజన సమస్యల పరిష్కారం, వారి హక్కుల సాధనను పట్టించుకోకుండా అడవితల్లి విగ్రహానికి పూలదండలు వేసి, పాలాభిషేకాలు చేయడం సమంజసం కాదన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి దందులూరి వర్మ మాట్లాడుతూ కొంతమంది రాజకీయ వేత్తలు కేవలం ఆర్భాటాలకోసమే ఈ తరహా దినోత్సవాలకు హాజరవుతున్నారని, గిరిజన సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదన్నారు. ఐటీడీఏ పరిధిలో 171 గ్రామాలు, నాన్‌షెడ్యూల్ గ్రామాలుగా ఉన్నట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు నాయుడు, ఎం.భాస్కరరావు, కె. వెంకటస్వామి, సర్పంచ్ తాడంగి కన్నంనాయుడు, హిమరిక పెంటయ్యలతోపాటు గిరిజన కళాకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బుద్ధదేవ్ భట్టాచార్య మృతి తీరని లోటుపార్వతీపురం



భట్టాచార్య చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

పార్వతీపురంటౌన్: పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు కామ్రేడ్ బుద్ధదేవ్ భట్టాచార్య మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. ఈ మేరకు గురువారం తమ పార్టీ కార్యాలయంలో సంతాప దినం నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టాచార్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఎర్రవందనాలు తెలియజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ 80ఏళ్ల వయస్సు వరకు ఉద్యమ పరంగా, రాజకీయ పరంగా ఆయన చేసిన నిస్వార్థ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి గొర్లె వెంకటరమణ, నాయకులు తులసీరాం, కె. రామస్వామి, సూరిబాబు, భాస్కరరావు, పండు, రాజుపాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా బీటీరోడ్డు



బగ్గందొరవలస వద్ద ఏర్పడిన గోతులు



కృషి విద్యాలయం వద్ద ఏర్పడిన గొయ్యి



చెరకు తూనిక కేంద్రం వద్ద చెరువును తలపించిన రోడ్డు

- వాహన చోదకులు, ప్రయాణికుల అవస్థలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

సీతానగరం: మండలంలోని చినభోగిలి గ్రామం నుంచి మక్కువ వైపు వెళ్లే రోడ్డు గోతులమయం కావడంతో ప్రమాదాలకు నిలయంగా తయారైంది. దీంతో ప్రజలు, ప్రయాణికులు, వాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు. చినభోగిలి మీదుగా మక్కువ, సాలూరు, దుగ్గేరు, శంబర ప్రాంతాలకు నిరంతరం వాహనాలు తిరుగాడుతుంటాయి. కొత్తవలస డ్యామ్ జంక్షన్ నుంచి చిన భోగిలి వరకూ బీటీరోడ్డుపై భారీ ఎత్తున గోతులు ఏర్పడడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోకుండా ఈ రోడ్డు మీదుగా ఉద్యోగులు, వివిధ శాఖల అధికారులు మక్కువ, దుగ్గేరు రాకపోకలు సాగిస్తున్నారు. మలుపులో డ్రైవర్ ఆమరిస్తే ప్రమాదం జరిగినట్లేనని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిరంతరం వాహనాలు తిరుగాడే రహదారిని పాలకులు, ఆర్అండ్‌బీ అధికారులు స్పందించక పోవడం శోచనీయమని విమర్శిస్తున్నారు.



తామరఖండి చర్చివద్ద మలుపులో గొయ్యి



చినభోగిలి గుడివద్ద ప్రమాదకర మలుపు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పార్వతీపురంటౌన్: మండలంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ రామారావు తెలిపారు. తాళ్లబురిడి సబ్‌స్టేషన్ పరిధిలో గంగాపురం ఫీడర్ మెయింటనెన్స్‌కు సంబంధించి ఈ అంతరాయం కలుగుతుందన్నారు. ఈ క్రమంలో జోకిశీల, గోచెక్క, డీకేపట్నం, ములగ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

సాలూరు: పట్టణం, మండలంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఈఈ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండబోదని పేర్కొన్నారు. సాలూరు పట్టణ, మండల ప్రజలు, రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

రైతులే విత్తనాలు తయారు చేసుకోవాలి

- జిల్లా రైతు శిక్షణ సమన్వయకర్త శ్రీనివాసరావు

కొమరాడ: వరి పండించే రైతులు తమ పొలంలో మెలకువలు పాటించి నాణ్యమైన విత్తనాలు తయారీ చేసుకోవాలని జిల్లా రైతు శిక్షణ సమన్వయకర్త ఆర్.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పరుశురాంపురం గ్రామంలోని విత్తనాభివృద్ధి కేంద్రంలో విత్తనాల తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ ఏడీ నిర్మల జ్యోతి మాట్లాడుతూ ఎరువులు యాజమాన్యం రైతులు వాడే పద్ధతులపై అవగాహన కల్పించారు. రైతులు విత్తనాల కోసం ప్రభుత్వంపై ఆధార పడకుండా తమకు అవసరమైన విత్తనాలను నాణ్యతతో తయారీ చేసుకోవచ్చన్నారు. వరి పంట దుబ్బ చేసి సమయం, చిరుపొట్ట దశ, కోత కోసిన సమయాల్లో కేళిలను గుర్తించి తీసేయాలని సూచించారు. ఏఓ పి.శంకరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.